# అరవిందము

వి. వి. రెడ్డిగారు

కమల నిష్కళంకహృదయ ఆమె సూక్ష్మగ్రాహిణి ఆనందాలంకారములకు నిధి. ఎల్లప్పుడును చిరునగవు లామె మోమున చిందులు త్రొక్కుచుండును. కోప మనునదెట్టిదో నామె యెఱుంగదు. సుకుమారి స్థిర చిత్త.

తండ్రిపేరు కోటీశ్వరుడు. అగర్భ శ్రీమంతుడు. ఎల్లప్పుడును ధనధాన్యములతో తులతూగుచుండును. కులమునకు కమ్మ. వీరి గ్రామము కపిలేశ్వరం. కోటీశ్వరునిగారికి పెద్దదొర. గ్రామమునందలి కమ్మ దొర లెల్లరు తాను చెప్పిన చొప్పున నడుచుకొనవలయును.

తనయునంగు పుత్రికయగు కమలయు విద్యాబుద్ధుల యందుత్తమురాలని చేయవలయునని యాతని కెల్లప్పుడును గొప్ప కోరిక. ఒక్కగా నొక్క కూతురు. అతి గారాబముతో పెంచుచుండెను. కోటీశ్వరుడు విద్యా విహీనుడైనను ప్రాపంచిక వ్యవహారముల యందతి నిపుణుడు. ఆధునిక విషయములయం దభిరుచి మెండు. ఇంట నొక పండితోత్తమునిచే కూతురునకు విద్యా బుద్ధులు నేర్పించుచుండెను.

పదునొకొండవయేట గుంటూరునందలి జాతీయ పాఠశాలయగు శారదానికేతనమున కామెను పంపించెను. కమల సూక్ష్మగ్రాహిణియని ముందే చెప్పి యుంటిమి. పాఠశాలకుపోయిన కొలదిదినములకే తన నైపుణ్యమును వెలిబుచ్చుచు తోడిబాలికలను మించి, విద్యయందును నడవడికయందును ఉపాధ్యాయుల మన్ననలకు పాత్రురాలయ్యెను సంగీతమామె సొత్తు. కంఠము కోకిలను ధిక్కరించును.

సంవత్సర మాకరువారెను. వేసవికాలపు సెలవులు. కమల తండ్రిగారిచే పంపబడిన బంధువునితో కలసి స్వగృహము చేరెను.

* * *

కమల కిప్పుడు పండ్రెండుసంవత్సరములు ప్రాయం. రజస్వలానంతరము ఇంటియొద్దనే, వచ్చిపోవు చుట్టాలతో ముచ్చటగా కాలము బుచ్చుచుండెను.

మండు వేసంగులప్పుడు శ్రీరామనవమి ఉత్సవములు చెలరేగుచుండెను. వీధులన్నియు పందిళ్ళతోను తోరణములతోను అలంకరింపబడియెను. వీధివీధుల నాటకములు, హరికథలు విరివిగా జరుగుచుండెను. అంగనలు వీధివీధుల దిరిగి యానందించుచుండిరి. ఒకనాటిరాత్రి కమల తోడిచేడియలతోగూడి నడివీధిలోని శ్రీరామాలయముదగ్గర నారాయణదాసుగారు చెప్పుచున్న హరికథను వినుటకై పోవుచుండెను. త్రోవలో నెవరో నలువురుయువకులు వారి కెదురుగా వచ్చుచుండిరి. వారిలో నొకడు "ఆమె మాదొర వారి కమల"యని మెల్లగాబల్కెను. ఆపలుకులు కమలయొక్క కర్ణపుటములలో ప్రతిధ్వనించెను. ఆశ్చర్యమున కనులు మిరుమిట్లు గొల్పెను. తదేక దృష్టితో నాయువకుని వీక్షించెను. హృదయము చలించెను. మోమునందొక వింత తేజస్సు విజృంభించెను. ప్రణయకోర్కె మొలకెత్తెను. దేహము మాత్రము తోడివారితో పోవుచుండెను గాని, మనస్సంతయు నాయువకునియందే లగ్నమై పోయెను. కర్ణరసాయనమగు దాసుగారి హరికథ యందు ప్రీతిలేదు. చెలులకు సాకుచెప్పి గృహాభిముఖురాలయ్యెను. తన గదిలోనికిపోయి తలుపులు బిగియించి పాన్పుపైబరుండి ఆయువకుని ముఖారవిందమునే మనస్సున చిత్రించి పొంగి పొరలు ప్రణయాంబుధిలో తేలిపోవుచూ, పూవిలుకుని వాడితూపులకు తాళజాలక క్రుంగి కృశించి ప్రక్కపైనే ఉన్మత్తయై నిదురబోయెను.

* * *

వెంకడు దొరవారి పెదపాలేరు. ఏటేట దొరవారికొక కిర్రుచెప్పులజోడు బహుమతి చేయుట వెంకనికి మామూలు. ఈయేడాని కుమార్డు కాంతయ్య 'ఇంటరుమీడియెట్' పరీక్షయందుత్తీర్ణుడగుటంజేసి అమితానందముతో వానిని దొరవారికి చూపించు నిమిత్తము వెంటనిడుకొని, తానే స్వయముగా తయారుచేసిన కిర్రుచెప్పులజోడును చేతబట్టుకొని దొరవారి దర్శనార్థమైపోయెను.

◆ ◆ ◆

దొరవారు కాఫీవగయిరాలు పాటింపరు. పాలు పెరుగులాయన కమిత ప్రీతి. తొమ్మిదిగంటల ప్రొద్దెక్కెను. అప్పుడే పెరుగన్నం పూర్తిగా భుజించి గఱ్ఱున త్రేన్చుచు, లోగిటి ముందటివరండాలో పడకకుర్చీమీద పరుండెను. వెంకయ్య అతి వినయముతో దొరవార్కి నమస్కరించెను. కాంతయ్యయు నట్లే గావించెను. దొరవారు సంతోష పూర్వకముగా వందనములనందుకొని, "ఏరా వెంకడూ! మీవాడేమి చేస్తున్నాడు"అని ప్రశ్నించెను. "సిత్తం మావోడు ఎప్ యే పాసయినాడట బాబూ! దొరోరికి సూపిద్దామని తీసుకొచ్చా"అని వెంకయ్య బదులు చెప్పెను.

◆ ◆ ◆

కమల తనగది కిటికీలోనుండి చూచినది. సమస్తము విన్నది. మనోరంజకుని గుర్తించినది. హృదయమునందు ప్రణయజ్వాలలు రగుల్కొన్నవి. తత్తర పాటుతో నిటునటుచూచినది. ఏమియు తోచలేదు. ఎట్టకేలకించుక శాంతి నొంది రివ్వున వెలుపలికివచ్చి "నాన్నగారు! నాకుకూడ చెప్పులు తెప్పించరూ!" అనియెను. చూడ్కులు మాత్రం చీడీలక్రింద నిలుచుని యున్న యువకుని మీదికే సాగిపోయెను. ఆ చూపులలో అలంకార ముట్టిపడుచుండెను. అందుండి విద్యుచ్ఛక్తి ప్రవహించుచున్నది. కాంతయ్య ఆ ప్రవాహములో పడెను. మైమరచెను. అప్రయత్నముగా చలించిపోయెను. ఒళ్ళు పులకరించినది. ఒండొరుల చూడ్కులు తీవ్రముగా ప్రసరించినవి. ఇరువురును నిర్మల ప్రేమలో లీనమైపోయిరి.

◆ ◆ ◆

జూలై నెల ప్రారంభమాయెను. కాంతయ్య కాలేజికి వెళ్ళవలసి వచ్చెను. పిఠాపురపు మహారాజావారి కళాశాలలో బి.యె. చదువుటకు పోవుచుండెను. మహారాజావారు సంవత్సరమునకు రెండువందలు సహాయము చేయుచుండిరి. పద్దెనిమిది యేండ్ల ప్రాయము. నూనూగుమీసములు; నున్నని చెక్కిళ్లు; పొడవునకు తగినలావు, లావునకు తగిన వక్షస్థలము. రూపమునుబట్టి కులమును నిర్ణయింప వలసిన అతనిని మొదటి తరగతిలో చేర్చక తప్పదు. వేయేల మోహనాకారుడు. కళాశాలలో చేరవలసిన గడువు దాటిపోయెను. ఏలకో వ్యాకుల మనస్కుడైయుండెను. ఊరు విడచిపోవుటకు బుద్ధి పుట్టటములేదు. లోలోన ఆయాసపడు చుండెను. కాని ప్రాణమిత్రులకైనను తన గుట్టునివ్వలేదు.

◆ ◆ ◆

అర్థరాత్రివేళ; కమల తత్తరపాటుతో లేచెను. ప్రాణకాంతుని కౌగిళ్లలో లేదు. ఆశాభంగమాయెను. తన్నాడించుటకు మంచముక్రిందనో, బల్లక్రిందనో దాగొనెనని వెదకజొచ్చెను. ఎందును గాన్పించలేదు. కండ్లు నులుమికొనెను. తేరిపారచూచెను. 'కల' యని స్థిరపరచుకొనెను. నేత్రము లెఱ్ఱబారెను. వేడి నిట్టూర్పులు విడచుచుండెను. అనుకోనిరీతిగా మరల ప్రక్కపైబడి నిదురబోయెను.

తెలతెలవారజొచ్చెను. కొక్కరోయన్న కోడి కూతవిని కమల త్రుళ్ళిపడిలేచి కూర్చుండెను. పాపమా కోమలి కింకేమితోచును! ప్రాణకాంతునే పూజించుచుండెను.

"నాకాంతు డింత చక్కనివాడే! ఆయాకారమునందేమియు కళంకములేదు. అందచందముల నేరికిని


378

తీసిపోదు. అట్లయిన నాయంటరాని తనమెందున్నది. సర్వమానవులవలెనే యున్నాడే! అస్పృశ్యుడెట్లు లాయెను. ఇది పట్టి కల్ల. కేవలము మానవకల్పితము. పేదరైనంత మాత్రమున నాప్రియుడంటరానివా డెట్లగును," అని తనలోతాను వితర్కించుకొను చుండెను. తుట్టతుదకెట్టులైనను తనప్రియుని కొక లేఖ వ్రాయ నిశ్చయించి ప్రక్కనున్న కలము కాగి తముతీసి యిటుల వ్రాయ మొదలిడెను.

హృదయకాంతా!

రేయెల్లమీ కౌగిళ్లలో మురిసిపోతిని. కామజాడు నిర్దయుడై నన్నుదహించి వైచెను. మనస్సు మనసున లేదు. ఈ దిగువ పద్యములో నంతయు ముద్రించు చున్నాను.

"స్వప్నమందున నినుజూచి సంతసిల్లి
ప్రణయగీతాల గొంతెత్తిపాడుకొంటి
గాని, యిరువుర మేనాటికేని, చేర్మి
గూడుకొనకుందుమా యంచు గుందుచుంటి."

మీదర్శన భాగ్యమునకై, స్వాతిచినుకులకు ముత్య పుచిప్పలునోళ్లు తెఱచుకొనియుండు విధమున, వేచి యున్నాను.

ఇట్లు, మీ చరణదాసి,
కమల.

.................................

పరీక్షలు ముగిసినవి. మరుసటిదినము కాంతయ్య స్వగృహమునకు పోవలయును. పదిగంటలకు మామూ లుగా కాలేజికివెళ్లెను. పోస్టుబంట్రో తొకయుత్తర మును తీసుకొనివచ్చెను. కాంతయ్య తీసుకొని, విలా సముచూచి, వ్రాత యెవరిదాయని యూహించి, చదు వించిచూడగా, "హృదయకాంతా," యను అక్షర ములు గాన్పించెను. తిటూలున లేఖ అడుగుభాగ మును చూచెను. ముత్యములవలె ముద్రింపబడిన 'కమల' యను యక్షరములజూచెను. కాంతయ్య కంపించిపోయెను. నిలువున నీరైపోయెను. అతని ఆశ్చర్యమునకు మేరయేలేదు. ఎట్టకేలకు తెప్పిరిల్లి, శాంతముగా నొకచో గూర్చుండి యుత్తరమును పూర్తిగా చదివెను. దీర్ఘాలోచనా నిమగ్నుడాయెను. ఏమియుతోచలేదు. దిర్వునలేచి బసకుపోయెను.

.................................

దినములు గడచిపోవుచుండెను. కమలహృదయాంత రంగమందు మొలకెత్తిన ప్రణయ 'లత' దినదినప్రవర్ధ మానమై గంభీరముగా బరిణమించుచుండెను. కాంత య్య కులభ్రష్టుడు, అంటరానివా డనువిషయము లా యఖండ ప్రజ్వలితమైన ప్రేమాంబుధిలో కలిగిపోయి నవి. కమలకవి గోచరించుటలేదు. అహోరాత్రము లామె యాత్మనాథుని ధ్యానములో మునిగిపోయినది. ఆకలిదప్పిక లెరుంగదు. వేసారిపోయినది; కృశించి పోయినది. మనోవేదనతో తపించిపోవుచున్నది.

.....................

"అతిరహస్యం బట్టబయ"లను. లోకోక్తి అక్ష రాల సంఘటించుచుండును. లోకులు కాకులు; ఏ నోటవిన్నను, 'కమల' కాంతయ్య. అను మాటలే వినవచ్చుచుండెను. ఊరంతయు దావానలమువలె నంటుకొనియెను. కమ్మదొరలందరు గూడిరి. 'మాల మాదిగ వెధవలకు కళ్లుపొరలు కమ్మిపోతున్నాయి' అని కొందరనిరి.

'ఇంకా చూస్తారేం,' అనిరి కొందరు. తలొక కఱ్ఱ చేతబట్టిరి. కమల మేనమరిదియగు వెంకటేశు డు నాయకుడు. సింహనాదములు చేసిరి. భేరీరవములు మ్రోయించిరి. అమాంతముగా మాలపల్లెపైబడిరి.

పల్లెఅంతయు గొల్లుమని ఘోషించిపోయినది. మాలమాదిగలు తయారైరి. బాణాకఱ్ఱలు చేతబట్టిరి.



379

గిరగిర త్రిప్పివేసిరి. ఊరివయులు యుద్ధభూమైపోయెను. చట్, చట్ మని కఱ్ఱలు మ్రోగిపోయెను. కాంతయ్య కఱ్ఱత్రిప్పుడు వ్రేటునకొకని పడవేయు చుండెను. పద్మవ్యూహములో పడెను. 'అభిమన్యుడా' యనిపించెను. అతిఘోరముగా పోరాడుచుండెను.

సూర్యభగవాను డపరాద్రిని గ్రుంకిపోయెను. గాఢాంధకారము లలముకొనియెను. యుద్ధభూమి స్మశానముగా మారిపోయెను. కాంతయ్య రణరంగములో కూలిపోయెను.

కాంతయ్య మృత్యువార్త తంతి వేగమునపోయెను. కమలయొక్క కోమలమగు హృదయమును బ్రద్దలు చేసెను. తంతివిూటిన వీణవలె నామె శరీరము కంపించిపోయెను. సుడిగాలిపడిన యోడవలె వడకి పోయెను. ప్రాణకాంతుని పరమునందైనను కలుసు కొందు ననుకొనియెను. తటాలున దొడ్డిలోనున్న బావిలో దుమికెను. అదృశ్యయైపోయెను. మరునటి దినము ఊరంతయువచ్చిరి. బావిలో తొంగిచూచిరి. అదృశ్యమైన 'కమల' ఆశ్చర్యముగా 'అరవిందమై' నిండువికాసముతో నిర్మలోదకముల దేలుచుం డెను.

## అప్పంపుఁ బ్రేమ

ఏరాచకన్నయు నెలమిఁ బెండ్లాడని పుట్టుగ్రుడ్డినిఁ గోరి చెట్టపట్టి
పతికిలేని సుకంబు సతికిని దగదని కనులకడ్డంబుగా గంతగట్టి
పుత్రులు నూర్వురు పుట్టిన నొకనిని గనుఁగోక మనసును గట్టిపెట్టి
సమరోన్ముఖుండయి కొమరుండు చనునన్నపాశీ గెల్పుతమని వరమునెట్టి

భర్త వెంబడి నడవికి బయలుదేరి
కష్టములకోర్చె గాంధారి కడకమీరి
ఇంతకంటెను భక్తిలో నెక్కువేరి ?
సకల కళ్యాణ గుణధన్య సర్వమాన్య.

'సోమనాథకవి'